క్లుప్తంగా

పోటీల్లో సత్తా చాటి జిల్లాకు ఖ్యాతి తేవాలి


క్రీడాకారుడు లోకేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, పీడీ ఆనంద్

ధర్మవరం అర్బన్: తమిళనాడు జెప్పియార్ యూనివర్శిటీలో ఈనెల 31నుంచి జరగనున్న ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫస్టియర్ బీకాం విద్యార్థి లోకేష్ గురువారం బయల్దేరి వెళ్లాడు. ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, పీడీ ఆనంద్, అధ్యాపకులు లోకేష్‌ను అభినందించి వీడ్కోలు పలికారు. పోటీల్లో సత్తా చాటి జిల్లాకు ఖ్యాతి తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు లోకేష్ ఎస్కే యూనివర్శిటీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడని తెలిపారు.

పండ్ల తోటల సాగుకు దరఖాస్తులు

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ అనీల్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఐదు ఎకరాలలోపు మెట్ట భూమి ఉన్న చిన్నసన్నకారు రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. మామిడి, చీనీ, అల్లనేరేడు, జామ, కొబ్బరి, దానిమ్మ, సీతాఫలం, సపోటా, చింత, మునగతో పాటు పూల మొక్కలు నాటుకోవచ్చునన్నారు. పంటలను బట్టి మూడు సంవత్సరాల పాటు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందుతాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 9963903101 సంప్రదించాలన్నారు.

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోండి


మాట్లాడుతున్న సుభాష్

బత్తలపల్లి: మండల పరిధిలోని స్టేట్ బ్యాంకులో పంట రుణాలు పొందిన రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని బత్తలపల్లి శాఖ మేనేజర్ సుభాష్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గడువులోపు పంట రుణాలు రెన్యూవల్ చేసుకుంటే వడ్డీలేని రుణం, బీమాకు అర్హులవుతారన్నారు. రుణాలు రెన్యూవల్ చేసుకునేందుకు జూన్ 30 వరకు గడువు ఉందని తెలిపారు. గత ఏడాది తీసుకున్న తేదీకి ఒక్క రోజు ముందుగానే రెన్యూవల్ చేసుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలతో పాటు జామీనుదారునితో బ్యాంకులో సంప్రదిస్తే రుణాలు రెన్యూవల్ చేస్తామని మేనేజర్ తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణిమాల

ధర్మవరం అర్బన్: పట్టణంలోని యాదవవీధి సెక్టార్ పరిధిలోని లోనికోట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మాసికా మహోత్సవాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణిమాల ప్రారంభించారు. నెలనెలా వచ్చే రుతుక్రమం, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించడమే మాసికా మహోత్సవం ప్రధాన లక్ష్యమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే కిశోర బాలికలు, మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు.

హక్కుల పరిరక్షణే సీఐటీయూ ధ్యేయం


జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కదిరి టౌన్: కార్మికుల హక్కుల పరిరక్షణకు సీఐటీయూ పోరాటం చేస్తోందని ఆ సంఘం నాయకులు అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని పౌరసరఫరాల శాఖ గోదాములో గురువారం జెండాను ఆవిష్కరించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ శ్రమిస్తోందన్నారు. రైతు, ప్రజా పోరాటాలకు సంఘం అండగా నిలిచిందన్నారు. నాయకులు జీఎల్.నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, నారాయణ, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు




మాట్లాడుతున్న రామగిరి సీఐ శివాంజనేయులు, పుట్టపర్తిలో మాట్లాడుతున్న సీఐ కొండారెడ్డి, బత్తలపల్లి మండలం అప్పరాచెరువులో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కనగానపల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగిరి సీఐ శివాంజనేయులు, కనగానపల్లి ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కౌటింగ్ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్‌ఐలు మాట్లాడుతూ.. ఎన్నికల కౌటింగ్ సందర్భంగా అన్నిచోట్లా 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ కూడా అమలులో ఉంటుందన్నారు. మండలంలో ఎక్కడా బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి వీలు లేదన్నారు. ఎన్నికల్లో గెలిచిన పార్టీల వారు ఊరేగింపులు చేయడం, బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. ఎన్నికల కౌటింగ్ ముగిసిన తర్వాత గెలిచిన వారు, ఓడిన వారు ఒకరిపై ఒకరు గొడవలు చేసుకుంటే రౌడీషీట్లు ఓపెన్ చేసి జిల్లా బహిష్కరణ చేస్తామన్నారు. పీడీ యాక్ట్‌ను అమలు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో కూడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసుకోరాదన్నారు. ఇక ఎన్నికల కౌటింగ్ సందర్భంగా మండల కేంద్రంతో పాటు సమస్యాత్మక గ్రామాల్లో సాయుధబలగాలు మోహరించి ఉంటాయన్నారు. ఎవరైనా రాజకీయ వైషమ్యాలతో గొడవలు చేసుకుంటే పోలీస్ చర్యలు ఉంటాయన్నారు. గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహరించాలని కోరారు. సమావేశంలో అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ నాయకులు నిబంధనలు పాటించాలి

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజు రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి సూచించారు. సాయి ఆరామంలో గురువారం ఆయన పుట్టపర్తి పట్టణంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి పోలీస్ నిబంధనల గురించి తెలియజేశారు. కౌంటింగ్ రోజు జూన్ 4న పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎవరూ గుంపులుగా ఉండకూడదన్నారు. పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. బాణసంచా పేల్చేందుకు, డీజే అనుమతులు లేవన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. కౌంటింగ్ కేంద్రాల చుట్టూ 2 కిలోమీటర్ల ప్రైవేటు వ్యక్తులకు అనుమతులు లేవన్నారు. ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘర్షణలకు పాల్పడితే కటకటాలే

బత్తలపల్లి: ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజున గ్రామాల్లో ఎవరైనా పార్టీల పేరుతో ఘర్షణలకు పాల్పడితే కటకటాలు తప్పవని బత్తలపల్లి ఎస్‌ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం మండలంలోని అప్పరాచెరువు గ్రామంలో సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్, పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్న వారి ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ఎలా వచ్చినా వాటిని అన్ని రాజకీయ పార్టీలు, నాయకులు, కార్యకర్తలు స్వాగతించాలన్నారు. వ్యక్తిగత, పార్టీల పేరుతో గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేందుకు అందరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. తనిఖీల్లో ఏఎస్‌ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేరుశనగ పంపిణీ


ముక్తాపురంలో వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న వీఏఏ రుక్మిణి

కనగానపల్లి: సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల పంపిణీ మండలంలోని అన్ని ఆర్బీకేల్లో కొనసాగుతున్నట్లు ఏఓ కృష్ణకుమారి తెలిపారు. రెండవ రోజు గురువారం కనగానపల్లితో పాటు ముక్తాపురం, తగరకుంట గ్రామాల్లో 530 మంది రైతులకు సుమారు 465 క్వింటాళ్ల విత్తన కాయలు పంపిణీ చేసినట్లు స్థానిక వ్యవసాయ సిబ్బంది తెలిపారు. విత్తన కాయలు అవసరమైన రైతులు స్థానిక ఆర్‌బీకేల వద్దకు వెళ్లి త్వరగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వీఏఏలు, వీఎస్ఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

సజావుగా రాయితీ వేరుశనగ పంపిణీ

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వ్యవసాయ అధికారులు రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. తాడిమర్రి రైతు భరోసా కేంద్రంలో పిన్నదరి రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు విత్తన కాయలు పంపిణీ చేయగా, పెద్దకోట్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలోను 176 మంది రైతులకు 157.5 క్వింటాళ్ల విత్తన కాయలు పంపిణీ చేసినట్లు ఏఓ రమాదేవి తెలిపారు. విత్తన కాయలు రావడం ఆలస్యం కావడంతో పంపిణీలో జాప్యం జరుగుతోందన్నారు. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పేర్లు నమోదు చేసుకున్న ప్రతి రైతుకు విత్తనాలు పంపిణీ చేస్తామని వివరించారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..


పుస్తకాలను భద్రపరిచిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: వేసవి సెలవులు ముగిసిన అనంతరం జూన్ నెలలో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తోంది. ఇందులో భాగంగా చెన్నేకొత్తపల్లి మండలానికి రెండవ విడతలో 15,009 పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓలు మున్వర్ బాషా, ప్రసన్నకుమార్ నాయుడు గురువారం తెలిపారు. 8, 9, 10వ తరగతులకు సంబంధించి అన్ని సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ పుస్తకాలను ప్రాథమిక పాఠశాలలో భద్రపరిచామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది శివారెడ్డి, రామసుబ్బారెడ్డి, కేశవ, శివయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

జీవహింసను నివారించడమే పాదయాత్ర ఉద్దేశం

చెన్నేకొత్తపల్లి: జైన మత గురువు ప్రసన్న సాగర్‌తో పాటు మరి కొందరు చేపట్టిన అహింస సంస్కార్ పాదయాత్ర గురువారం చెన్నేకొత్తపల్లికి చేరుకుంది. వీరికి స్థానిక మోడల్ స్కూల్‌లో విడిది ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాదయాత్రలోని బృందం సభ్యుడు మాట్లాడుతూ.. ఏడాదిలో నాలుగు నెలలు మినహా మిగిలిన ఎనిమిది నెలలు ఈ పాదయాత్ర చేస్తూనే ఉంటామన్నారు. చతుర్మాసంలో వర్షాలు కురుస్తూ ఉంటాయని దీంతో ఈ నాలుగు నెలలు పాదయాత్రకు విరామం ఉంటుందన్నారు. రోజూ పది కిలోమీటర్లు మాత్రమే పాదయాత్ర సాగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు లక్ష కిలోమీటర్ల వరకు పాదయాత్ర సాగిందని.. ఈ పాదయాత్రకు విరామం లేదన్నారు. ఇతరుల పట్ల ప్రేమానురాగాలను కలిగి ఉండటం, జీవహింస చేయొద్దని భక్తులకు వివరిస్తూ ఈ పాదయాత్ర సాగుతుందన్నారు. రోజుకు ఒకసారి మాత్రమే గురువు ఆహారం తీసుకుంటారని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఈ పాదయాత్ర యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

ఆర్థిక సాయం కోసం దరఖాస్తులు

కదిరి అర్బన్: ఆర్టీసీలో 2023 జూన్ 30కు ముందు పదవీ విరమణ పొంది, క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీలో సభ్యత్వం ఉన్న విశ్రాంత ఉద్యోగులు ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని నేషనల్ మజ్దూర్‌యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిమోహన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సీసీఎస్ కార్యదర్శి తలాటం త్రాసు నోటిఫికేషన్ నంబర్ 532 జారీ చేశారన్నారు. దరఖాస్తుదారుడికి సీసీఎస్‌లో కనీసం 5 ఏళ్ల సర్వీసు ఉండాలన్నారు. దరఖాస్తులను జూన్ 30వ తేదీలోపు విజయవాడలోని సీసీఎస్ కార్యాలయానికి పంపాలన్నారు.

నేడు హోమియో మందుల పంపిణీ

ముదిగుబ్బ: పొగాకు, సిగరెట్లు, గుట్కా మానేందుకు ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేయనున్నట్లు బ్రహ్మకుమారీ ఆశ్రమం నిర్వాహకులు గురువారం తెలిపారు. ముదిగుబ్బలోని శివాలయం వద్ద సాయి భజన మందిరంలో శుక్రవారం సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ఉచిత హోమియో మందులు పంపిణీ చేస్తామని తెలిపారు.

పాఠకుల సంఖ్య పెరిగేలా చూడండి

ధర్మవరం: ధర్మవరం శాఖ గ్రంథాలయాన్ని జిల్లా కార్యదర్శి రమ గురువారం తనిఖీ చేశారు. గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా కార్యక్రమాలను పర్యవేక్షించారు. గ్రంథాలయంలో పాఠకుల సంఖ్యను పెంచడంతోపాటు సభ్యత్వాలను కూడా చేయించాలని తెలిపారు.

ముగిసిన అక్క దేవతల ఉత్సవాలు


కుంకాలు ఆడుతున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రంలో అక్క దేవతల ఉత్సవాలు ముగిశాయి. గత వారం రోజులుగా అంగరంగ వైభవంగా ఈ ఉత్సవాలను ప్రజలు నిర్వహించారు. గురువారం ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కుంకాలు ఆడుతూ ఆనందంగా గడిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా రథోత్సవం

పెనుకొండ: పట్టణంలో కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్సవమూర్తిని అలంకరించి రథంలో ఉంచి ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మడకశిరరూరల్: తడకలపల్లి గ్రామ సమీపంలో గురువారం హైవేపై ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. ఘటనలో ముందున్న లారీలోని ఇనుప రాడ్లు వెనుకున్న లారీలోకి దూసుకెళ్లాయి. ఘటనలో డ్రైవర్, క్లీనర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వెనుకవైపున్న లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతినింది. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

మారిన గ్రామాల రూపురేఖలు

- మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసిన ప్రభుత్వం
- పుట్టపర్తి నియోజకవర్గంలో రూ. 29.10 కోట్లతో సిమెంటు రోడ్లు


జగరాజుపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డు

పుట్టపర్తి అర్బన్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించింది. దీంతో గ్రామాల రూపురేఖలే మారిపోయాయి. ఏ గ్రామంలో చూసినా సీసీ రోడ్లు అందంగా దర్శనమిస్తున్నాయి. గతంలో వర్షాకాలం వచ్చిందంటే రోడ్లపై నీటి గుంతలు కనిపించేవి. వీధి దీపాలు వెలిగేవి కావు. రహదారులు అధ్వానంగా ఉండేవి. కొళాయిల్లో నీళ్లు వచ్చేవి కావు. అయితే సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధికి బాటలు పడ్డాయి. గ్రామాల్లో ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేసి వెలుగులు నింపారు. జల మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందించారు. మరోపక్క గ్రామీణ వీధులు సిమెంట్ రోడ్లతో మెరిసిపోతున్నాయి. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు చేయించడంతో గ్రామాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయి.

రూ. 29.10 కోట్లతో సీసీరోడ్లు:

పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 74 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో పలు పథకాల ద్వారా సిమెంటు రోడ్లు ఏర్పాటు చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం, గడప గడపకూ మన ప్రభుత్వం కింద విడుదలైన నిధులు, గ్రామ పంచాయతీ నిధులు, జెడ్పీటీసీ నిధులు, ఎంపీపీ నిధులను వెచ్చించి సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించారు. అమడగూరు, నల్లమాడ, ఓడీ చెరువు, బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల్లో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులు వెచ్చించి 412 పనులు రూ.23.86 కోట్లతో పూర్తి చేశారు. జెడ్పీ నిధులు రూ.5.14 క్లోతో 64 పనులు, ముఖ్యమంత్రి అభివృద్ధి పథకం నిధుల రూ.10 లక్షలతో 5 పనులు పూర్తి చేశారు. పుట్టపర్తి మండలంలోని నిడిమామిడి, దిగువచెర్లోపల్లి గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.45 కోట్ల నిధులు మంజూరైనట్లు అధికారులు పేర్కొంటున్నారు.

అన్ని గ్రామాల్లోనూ సిమెంటు రోడ్లు



ఎన్నికల కోడ్ ముగియగానే ప్రతి గ్రామంలోనూ సిమెంటు రోడ్డు నిర్మాణాలు పూర్తి చేస్తాము. వీటికి సంబంధించిన నిధులు ఉన్నాయి. పలు శాఖల ఆధ్వర్యంలో నిధులు మంజూరవుతున్నాయి. ప్రతి మండలంలోనూ కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాం ఇప్పటి వరకూ వేసిన సిమెంటు రోడ్లు అత్యంత నాణ్యతతో ఉన్నాయి.

– శ్రీనివాసులు, పంచాయతీరాజ్ డీఈ

బ్యాంకు ఖాతాలకు పింఛన్లు జమ చేస్తాం

బత్తలపల్లి: వైఎస్సార్ పెన్షన్ కానుకకు సంబంధించి లబ్ధిదారులకు జూన్ 1వ తేదీన (డీబీటీ) విధానంలో వారి ఖాతాలకు నగదు జమ చేయనున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ గురువారం తెలిపారు. బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో లింక్ అయిన వారికి డీబీటీ విధానంలో పింఛన్ నగదు జమవుతుందన్నారు. సచివాలయం వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని వెల్లడించారు. బ్యాంకు ఖాతాలు లేనివారు, ఆధార్‌తో లింక్‌కాని వారికి సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకొచ్చి పింఛన్ పంపిణీ చేస్తారని వివరించారు. పింఛన్ల పంపిణీ పర్యవేక్షణకు మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో మండల వ్యాప్తంగా 6,412 మందికి గాను రూ.1,89,96,500 నగదు మంజూరైనట్లు తెలిపారు. అందులో డోర్ టు డోర్ కింద 2,002 మందికి రూ.63,30,500లు, డీబీటీ విధానంలో 4,410 మందికి రూ.1,26,66,000లు విడుదలైనట్లు తెలిపారు. పింఛన్‌దారులు ఎవ్వరూ ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు.

కొనసాగుతున్న బీసీజీ వ్యాక్సినేషన్


సుబ్బరాయనిపల్లిలో బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో గురువారం క్షయ వ్యాధి నివారణకు బీసీజీ వ్యాక్సినేషన్ చేపట్టారు. ఎన్ఎస్ గేట్ డాక్టర్లు ఉదయ్, రవినాయక్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది టీకాలు వేశారు. ప్రతి గురువారం మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో వైద్య సిబ్బంది ఈ టీకా వేస్తారని డాక్టర్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా క్షయ వ్యాధిపై ఉన్న అపోహలు వాటి నివారణ చర్యలు, క్షయ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. క్షయ వ్యాధి నివారణకు బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రామలక్ష్మి, వెంకటనారాయణ, సీహెచ్‌ఓ గోవిందమ్మ, పీహెచ్ఎన్ పద్మావతితో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.